# నారీహృదయాలు : :

శ్రీ ఆరుమల్లి
విశ్వనాథరావు

ఒకానొక స్నేహితునికి జబ్బుగా ఉన్నదని చూసి వచ్చుటకు తన భర్త వెళ్ళిన ఏడవరోజున కాంతకు తన భర్తవద్దనుండి ఒక వుత్తరం అందింది. అతనిలా వ్రాశాడు—

"ప్రియమయిన కాంతకు,

దురదృష్టవశాత్తు నా మిత్రుడు చనిపోవటం వల్ల నేను వెంటనే రాలేకపోయాను. అతనికి వేరె వరూ లేకపోవటంవల్ల ఇచ్చటి మంచి చెడ్డలు నేనే చూడాల్సి వచ్చింది. దినకార్యం పూర్తి అయిన తర్వాత నేను బయలుదేరి వస్తాను. మరొక ముఖ్య విషయం, చాల విచారకరమైనదీ ఏమిటంటే అతని భార్య సావిత్రి ఏకాకి అయిపోయింది. ఇక్కడి సనాతన మూఢాచారాల మధ్య భయంకర వాతావరణంలో ఆమె ఉండలేనంటున్నది. ఆమె కూడా నా వెంట మనయింటికి వచ్చేస్తుంది. ఒక మిత్రుని భార్య విషయంలో కొన్ని బాధ్యతలు వహించటం నాకు తప్పనిసరి. ఇందుగురించి నువ్వు నాతో ఏకీభవించి యీ అనాథను ఉద్ధరించేందుకు సహాయపడతావని విశ్వసిస్తున్నాను.

"సంజీవం"

తన భర్త నిర్ణయానికి కొద్ది గొప్ప సంస్కారంగల కాంత ఒక విధంగా ఇందుకు సుముఖతనే తనలో తాను వెలిబుచ్చుకుంది. ఆ క్షణంలో ఆమె ముందు ముందు ఏ పరిణామాలు సంభవిల్లబోతవనే విషయం కూడ ఊహించలేదు. కాలంతో పాటు వ్యక్తుల భావాలుకూడ మారుతుంటవనే విషయం ఆమెకింకా అనుభవం కాదు గనుకనే తనభర్త ఒక వితంతు స్త్రీని తమ ఇంట్లో ఉంచేందుకు నిశ్చయించినందుకు తాను దూరం ఆలోచించలేకపోయింది.

ఒకనాటి ఉదయానికి వితంతు యువతి సావిత్రిని వెంటబెట్టుకుని సంజీవం బండి దిగాడు. వారు యింట్లో అడుగుపెట్టగానే కాంత సావిత్రి తలని తన వక్షానికి అదుముకుని సానుభూతి ప్రకటిస్తూ అంది—"చెల్లాయ్, ఇంత చిన్నతనంలో నీకీ దురదృష్టం పట్టినందుకు చాలా విచారంగా ఉంది. ఇది నీ స్వంత యిల్లుగా నేను నీ తోబుట్టువులాగ తలంచుతావని అనుకుంటాను."

సావిత్రి కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఆమె కండ్లను ఎత్తి కాంత ముఖంలోనికి చూసింది. తను ఊహించలేదు, యీ పరాయి స్త్రీ తనలాంటి ఒక నిర్భాగ్యురాలికి ఒక విధవకు ఇంత సహృదయంతో తన యింట్లో ఒక సురక్షిత స్థానాన్ని ఇవ్వగలుగుతుందని. ఆమె మార్గం పాడుగా ఆలోచనలోనే ఉంది. తన రాకను ఆమె యేవిధంగా పరిగణిస్తుందో ? సనాతన సమాజానికి వితంతువు ఒక ఘోర శత్రువు. ఆమె నెప్పుడూ అణగ్రొక్కటానికే అది చూస్తుంటుంది. యీ విషయాన్ని ఆలోచించకుండా కాంత తనని ఆదరించిందంటే తనకిది కీడులో మేలు. తన పరిస్థితులు మంచిగానే ఉన్నవన్న మాట.

సంజీవం ఒక చల్లటి నిట్టూర్పు విడిచాడు. తన చర్యను సమర్థించినందుకు భార్యను లోలోన అభినందించుకున్నాడు. సావిత్రి భవిష్యత్ గురించి ఆలోచిస్తూ స్నానానికి నడిచాడు. కాంత సావిత్రిని లోనికి తీసుకువెళ్ళి ఇంటిని పరిచయం చేసింది. యీ కొత్తమనిషిని యీ వితంతు స్త్రీని ఇరుగు పొరుగు వింతగా చూసింది. తలవొక రకంగా అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. కాంత ఇవేమీ గమనించకుండా తన పనిలో లీనమయింది. కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచిపోయినై. సావిత్రి వెలిబుచ్చిన మీదట సంజీవం ఆమెకు నర్సింగు శిక్షణ ఇప్పించి హాస్పి

టల్లో నర్సుగా ప్రవేశపెట్టాడు. ఉదయం సాయంకాలం సంజీవం సావిత్రి ఇంట్లో ఉన్నప్పుడు గదిలో యేకాంతంగా కూర్చుని ఏవేవో కబుర్లు చెప్పుకోవటం వాద వివాదాలు చేయటం, శాంత యీ విషయాల్ని అట్టే గమనించకండా శ్రద్ధతో తన పన్లలో నిమగ్నమై ఉండటం జరుగుతున్నది. తనభర్త తన పట్ల ద్రోహంతో ప్రవర్తిస్తాడని ఆమెకు ఊహాయినా కలుగక పోవటమే ఇందుకు కారణం.

ఒకరోజు పంపుదగ్గర ఇరుగు పొరుగు ఆడవాళ్ళు మాటలు త్రిప్పుకుంటూ హెచ్చరించారు.

"ఏమే శాంతా! మీయింట్లో యేం జరుగుతున్నదే? నువ్వెంత అమాయకురాలవే తల్లి!"

విని శాంత ఉలిక్కిపడింది.

తిర్గి ఒకామె అంది—"నువ్వెట్లా సహిస్తున్నావే?"

"అసలు విషయం ఏమిటో చెప్పరేం?" అన్నది అమాయకంగా.

"యీ సావిత్రి మీ యింట్లోనే ఉంటుందా ఇక?"

శాంత ఇది విని చిరునవ్వుతో జవాబిచ్చింది.

"ఉంటుంది. ఇక్కడే ఉంటుంది."

యీ జవాబుకు వారు ఒకరి మొహాల వంక మరొకరు చూసుకున్నారు. వారిలో శాంతతో ఎక్కువ పరిచయంగల ఒకామె అంది—

"సావిత్రి విధవ, నవయౌవనవతి, మీఆయన ఆమెతో నవ్వుతూ ఆడుతూ, గంటల తరబడి ఏకాంతంలో గడపటం చూస్తూ కూడ నువ్వు తిరిగి అడుగుతున్నా మాచేత చెప్పించుకోవాలని కోర్తున్నావు, ఎంత పిచ్చిదానవు? సుఖమూ శాంతిగల ఈ యింట్లో అశాంతికి తుపాను రేగటానికి అవకాశం కలగజెయ్యబోకు. బయటి ప్రపంచం యేమనుకుంటున్నదో నీకు తెలియదు. మీ ఆయన సావిత్రిని ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చాడు. నీ అంతట నీవు గ్రహించి సరిదిద్దుకోవాల్సిన విషయాలివి. సమయం మించిపోతే నీజీవితం అధోగతిఅవుతుంది. మేలుకో!"

చిత్రమేమిటంటె ఇది విని కూడ యీ విషయాలని శాంత నిర్లక్ష్యంగా త్రోసి పుచ్చింది. చిరునవ్వుతో అంది—"సావిత్రి మంచిది, ఆమెయింకా ముగ్ధబాలిక. ఇలా రకరకాలుగా అర్థాలు తీయటం బయటి ప్రపంచానికి ఇవాళ కొత్త కాదు."

అంటూ బిందె ఎత్తుకు వెళ్లిపోయింది. శాంత యొక్క యీ వింత వైఖరికి అనుభవం సంపాయించిన అక్కడి అమ్మలక్కలు ముక్కుమీద వేలేసుకున్నారు. శాంత ఇంత నిర్లక్ష్యంగా యీ వాదును త్రోసిపుచ్చటానికికూడ కారణం తనభర్తయందు తనకున్న గాఢ విశ్వాసమే, తన భర్త తనని మొదట్నించి నిష్కల్మష హృదయంతో ప్రేమిస్తూ ఉండటమే. మరొక విషయం కూడ ఆమె తనలో జీర్ణించుకుంది. నిరపరాధులయిన వితంతువులపట్ల లోకానికి అసూయ, వారిపై అవకాశం కలిగినప్పుడల్లా అపవాదులు కురిపించటం ఆడిపోసుకోవటం యేదో విధంగా వాళ్ళను నాశనం చేసేటందుకూ యీ లోకానికి జీతం భత్యంలేని పని. తనలాంటి సంస్కారంగల స్త్రీ బయటి లోకంతో ఏకం కావటం అనేది ఎన్నడూ జరుగదు.

బయటి వాతావరణంలో చర్చలు ఎక్కువైనై. వాళ్ళలో కొందరు తనకు వినిపించేలా కూడా గుసగుసలాడటం మొదలుపెట్టారు. యీ విషయాలు రకరకాలుగా తనచెవిని పడినప్పటికి శాంత వాటిని వెంటనే మర్చిపోయేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది.

ఇలా ఉంటుండగా సావిత్రికి ఒకసారి జ్వరం వచ్చింది. నాలుగయిదు దినాలవరకూ ఆమె లేవలేదు. శాంత ఆమెకోసం జావ తయారుచేసి ఒకగిన్నెలో పెట్టుకుని వంటింట్లోంచి గదిగుమ్మం దగ్గరకు వచ్చింది. గదిలో సావిత్రి సంజీవం చేయిపట్టుకుని అంటున్నది—"నేనేం చెయ్యను సంజీవ్? నేను చనిపోతే..."

సంజీవం తన కుర్చీని సావిత్రి మంచం వద్దకు దగ్గరగా లాగుకొని ఆమె మొహంలోనికి చూస్తూ అన్నాడు—"భయపడకు సావిత్రి!"

"భయపడ్డటంలేదు. ఆలోచిస్తున్నాను. నా జీవితం ఏమి కానున్నదా అని. పూర్వజన్మలో చేసిన పాపం ఏదో యీజన్మలో పీడిస్తున్నది."

సంజీవం ఆమె మొహంమీద జీరాడే ముంగురులు సర్దుతూ అన్నాడు—"ఏమంటున్నావ్ సావిత్రీ?" సావిత్రి జవాబు ఇవ్వలేదు. ఆమె కండ్ల నుండి భాష్పాలు వెలువడుతున్నై. సంజీవం ఆమె చెక్కిలి స్పృశిస్తూ అన్నాడు—

'ఏమయినా కష్టంగావుంటే చెప్పు సావిత్రీ?'

సావిత్రి అంటున్నది—

"నేను అభాగినిని, ఏకాకిని, నాది శూన్య జీవితం."

గుమ్మంలో నిల్చున్న శాంత యీమాటలు వింది, యీదృశ్యం చూసింది. ఆమె హృదయం కంపించింది. బయటివాళ్ళ గుసగుసలు కల్పనలుకావు. తన చెవులో ఎవరో హెచ్చరిస్తున్నారు—"చూడవే శాంతా! నీయొక్క దుర్భాగ్యం, నీసౌభాగ్యం అపహరించబడుతోంది."

ఇప్పుడేం చేయాలి? తనగతి యేమికానున్నది?

ఇంతలో సంజీవం అంటున్నాడు—

"సావిత్రీ! ఇప్పుడు నువు ఏకాకివికావు.

సావిత్రి కళ్ళు ఆంత నీరసంలోనూ ధగధగ మెరిశాయి. యీ పరిస్థితులలో ద్వారంలో నిల్చున్న శాంత కళ్ళముందు ఏదో గాఢాంధకారం వ్యాపించింది ఆమె సమస్తశరీరం కంపించింది. చేతిలోని గిన్నె దానంతట అది జారి క్రిందపడిపోయింది. శరీరం తేలిపోయి తూలబోయి గుమ్మాన్ని ఆనుకంది. యీ శబ్దానికి సంజీవం ఉలిక్కిపడి వెనుతిరిగిచూసి లేచి శాంత వద్దకు వెళ్ళి అన్నాడు—"ఏం జరిగింది శాంతా?"

ఖిన్నురాలై అన్నది శాంత—"గిన్నె చేతిలోంచి జారిపోయింది."

సంజీవానికి కోపంవచ్చింది— "అంతకళ్ళు ఎక్కడో పెట్టుకుని నడవకపోతేం?"

అంటూ తీవ్రంగా చూశాడు. శాంత అతని మొహంలోనికి ఆవేదనగా చూస్తూ అన్నది. "పొరపాటు జరిగింది."

క్రిందపడిన గిన్నె తీసుకు వంటింట్లోనికి వెళ్ళిపోయింది, మళ్లా జావ తయారు చేసేటందుకు.

మర్నాటినించే సావిత్రికి జ్వరం తగ్గి లేచి తిరగటం, తనపని చూసుకోవటానికి వెళ్ళటం ప్రారంభించింది. శాంత పరిస్థితి మారిపోయింది. ఆమె తనలో రగుల్కొంటున్న ఆవేదనల్ని తనలోనే అణుచుకుంటూ వస్తున్నది. మొట్టమొదటిసారి ఆమె ఎప్పుడయితే గదిలో వారిరువురి సంభాషణ విన్నదో ఆ క్షణంనించి సంజీవం గదిలో మాట్లాడుతూ ఉంటే తను చేతిలోని పని విడిచిపెట్టి అక్కడికి చేరుతుంటుంది. మధ్యమధ్య తనలో తను దుఃఖిస్తుంది.

ఒకప్పుడు—ప్రాణేశ్వరీ! నా రాణీ, నీవు వెలిగించిన జ్యోతి నాజీవితానికి ఎంత ప్రకాశమిస్తున్నదో చూడు, నీలాంటి నిర్మల సహచారిణిని పొందగల్గిన నా అదృష్టం నేనే జన్మలో చేసిన పుణ్యఫలమో—అంటూ ఒక్క తనని ఆనంద సాగరంలో ముంచిన తన భర్త యీనాడు ఒక పరాయి స్త్రీ చేత లాగబడి తనమాటే మర్చిపోయినాడు. తను ఎంత నిర్భాగ్యురాలు అని అనుకుంది.

శాంత చిక్కిపోతున్నది. తన శరీర రక్షణలో శ్రద్ధ తగ్గింది, రూపం మారిపోయింది. ఇరుగు పొరుగు స్త్రీలంతా ఆమె అందాన్ని మెచ్చుకునేవారు, అటువంటి అందమంతా మారిపోయింది. అదికూడ గమనించటంలేదు. ఇరుగుపొరుగువారు ప్రశ్నించారు. ఆమె చిక్కిపోవటంగురించి వెంటనే అద్దం ముందుకువచ్చి తన ప్రతిబింబాన్ని చూసుకుంది. తనుతానే పోల్చుకోలేకపోయింది. చిక్కిసగమైన శరీరం లోతుకు వెళ్ళ

చుకుపోయిన ఆ కళ్ళు, యేనాటినుంచో తైలస్పర్శ యెరుగని ఆ కుంతలాలు ఎండిపోయిన కపోలాలు తనో పిచ్చిదానిగా తనకు స్ఫురిస్తున్నది.

ఒక రోజున సంజీవం అడిగాడు—"రోజు రోజూ మారిపోతున్నావ్, నీవంట్లో ఏదో జబ్బు ప్రవేశిస్తున్నట్లు కన్పిస్తోంది."

ఆమె క్లుప్తంగా సమాధానమిచ్చింది—"నా వంట్లో యే జబ్బూ లేదు. నేను బాగానే వున్నాను." సంజీవం మౌనం వహించాడు.

*  *  *

ఒకటి రెండు రోజులు గడిచిన తర్వాత సంజీవం డాక్టర్ని తీసుకువచ్చి శాంతను పరీక్ష చేయించాడు. పరీక్షచేసి డాక్టరు తిరిగివెళ్తూ అన్నాడు—"ఈమెలో యేదో మానసికరోగం ప్రబలుతున్నది. క్రమంగా క్షయలోకి దింపుతుంది. త్వరగా మేలుకోవాలి. ముందు గాలి నీరు మార్చాలి."

అంటూ వెళ్ళిపోయాడు. యీ మాటలు సావిత్రి కూడ విన్నది.

డాక్టరు వెళ్ళిపోయిం తర్వాత సంజీవం తిరిగి శాంత దగ్గిరికి వచ్చాడు.

శాంత అంది—"మీరు డాక్టర్నెందుకు పిలిపించారు? మీ మొహంలో ఆతృత దేనికి నాకేం పర్వాలేదు."

శాంత విషయమై డాక్టరు చెప్పింది శాంత వినలేదు. డాక్టరేం చెప్పాడో తన గురించి అని ఆలోచిస్తున్నది.

సంజీవం అన్నాడు. "లేదు శాంతా, డాక్టరు ఏదో మామూలు జ్వరమని చెప్పాడు. తొందర్లో తగ్గిపోతుంది."

"అవును మామూలు జ్వరం ఒకటి రెండు రోజుల్లో అదే తగ్గుతుంది. మీరు టీ త్రాగారా?"

"ఆ త్రాగాను."

"రెండు రోజుల్లో మీ మొహం ఎట్లామారి పోయిందో! భోజనం సరిగా కుదరటం లేదా?"

శాంత లేవటంలేని మూలాన్ని రెండు రోజుల్నుంచి వంట సావిత్రే చేస్తున్నది. సంజీవం ఏమీ సమాధానం యివ్వకుండా బయటికి వెళ్ళిపోయాడు. తనగదిలోనికి వెళ్ళి కుర్చీలో చతికిలబడ్డాడు. అతని ముందిపుడు రెండు సమస్యలు. ఒకటి శాంత, రెండు సావిత్రి...ఏనాడో తనకి తన హృదయాన్నర్పించి తనసర్వస్వమూ తానేనని విశ్వసించి ఏనాడూ లోపించని తన సేవలవల్ల సుఖమయ జీవితాన్ని అందించి ఆనందింపజేసిన జీవిత సహచారిణి శాంత ... తనని నమ్మి తన వెంట వచ్చివేసిన అభాగిని సావిత్రి...తను సావిత్రిని ఒక దృక్పథంలోంచి మరోవా దృక్పథంలోనికి తను లాగాడు. తను స్వయంగా కోరితెచ్చుకున్న విధానం తనకిపుడు వీడని సమస్య అయి కూర్చుంది. తనిపుడు యే మొహం పెట్టుకుని ఆమెను తిరస్కరించగలడు? అటు అమాయకురాలయిన అర్థాంగిని కోల్పోగలడా? ఇటు అభాగిని సావిత్రికి ద్రోహంచెయ్యగలడా? తనకిపుడేది కర్తవ్యం? తను యీ సమస్యల్ని యెలా పరిష్కరించుకోవాలి? తనకేమీ పాలుపోదు. బుర్ర వేడెక్కిపోయింది. శాంత పట్ల తను తీరని ద్రోహం చేశానని ఆ పరిణామమే మానసికంగా శారీరకంగా శాంత కృంగిపోయింది. ఆమె పరిస్థితి తలంచేసరికి అతని కండ్లు చమర్చై.

అదేసమయంలో యేమోమాట్లాడాలని వచ్చిన సావిత్రి అతని పరిస్థితి గమనించి మాట్లాడకుండా గుమ్మందగ్గరనుంచే గిర్రున మరలింది.

ఆనాడు సంజీవం బయటికికూడా పోలేదు. ఆరాత్రికి సావిత్రి భోజనానికి పిలిస్తే కూడ అతను పోలేదు. సావిత్రి అడిగిన యేవొక్క ప్రశ్నకూ అతను జవాబుయివ్వలేదు. కిటికీ యెదురుగా కుర్చీ వేసుకు కూర్చుని బయటి ఆకాశంలోనికి అట్లాచూస్తూ కూర్చున్నాడు. అట్లా కూర్చుని కూర్చుని రెండుగంటలకో మూడుగంటలకో లేచివెళ్ళి మంచంమీదవాలి నిద్రపోయాడు.

మర్నాడు ఉదయం సంజీవం యింకా నిద్రలేవలేదు. వీధిలో బండివచ్చి ఆగింది. సావిత్రి తన పెట్టె తనబట్టలు సర్దుకు బండిలో పెట్టింది. ఈ చప్పుడుకు శాంతిలేచి నీరసంగా తూలుతూ వీధిలోకిరాబోతోంటే సావిత్రి యెదురైంది. శుష్కించిన గొంతుతో శాంత అంది—"ఏమిటిది?"

ఆమె రెండుచేతులూ పట్టుకుని సావిత్రిఅంది "అక్కా! నిన్నలా సంబోధించేందుకూడ నేను అర్హురాలనుకాను. నీ చెల్లెలికంటె యెక్కువగా భావించి నాకీయింట్లో ఆశ్రయమిచ్చావ్. అందుకు ఫలితంగా ప్రశాంతమైన మీ దాంపత్య జీవితంలో ఆరని అగ్ని రగుల్కొలిపాను. అందులో నువ్వు నీతోపాటు ఆయన భస్మంకావటంకంటె నేనే ఆఫలితాన్ని అనుభవించ తల్చుకున్నాను. గతించిన విషయాలు మరిచిపో, నేను వెళ్లిపోతున్నాను." సావిత్రిబండెక్కింది. బండి కదిలింది. శాంత భర్తను బిగ్గరగా కేకలువేసింది. సంజీవంలేచి బయటికివచ్చి తూలిబోతున్న శాంతను పట్టుకున్నాడు. బండి వెళ్లిపోయింది.

———

## రాకెట్ విమానం

అమెరికాలో చార్లెస్ ఈగర్ అనే వైమానికుడు ధ్వనినిమించినవేగంతో ఒక రాకెట్ విమానంలో ప్రయాణంచేశాడు. ఈ రాకెట్ విమానం కాలిఫోర్నియా ఎడారిలో ఒకఫ్లయింగ్ ఫొర్ట్రెస్‌నుంచి వదలబడింది. కేబిన్ ఉష్ణమయంకాకుండావుండడానికి ఫ్రిజరేట్ చెయ్యబడింది. రక్తపుపోటు కలగకుండా అతను ప్రత్యేకంగా ఏఒత్తిడికలగచేయని దుస్తులు ధరించాడు. రాకెట్ విమానం ఒక చిన్న లేబరేటరీలా, ఒక బొత్తాం నొక్కితే వేగం తగ్గిపోయి క్రిందకు దిగిపోవడానికి వీలుగా అనేక యంత్రపరికరాలతో అమర్చబడివుందట.




# టెంపరేచరు

మీ టెంపరేచరు 102 కు ఎక్కువయినయెడల బాధపడునది మీ కేశములు. మీకు చిన్నమ్మవారయినను యిన్ఫ్లూయంజా, టైఫాయిడ్ అయినను లేక న్యూమోనియా జాడ్యమయినను మరేజాడ్యమయినను, పెద్దజ్వరమునకు తదుపరి కేశబీజములు అమితముగా నూడిపోవును. జ్వరమెంత కొద్దిదైనను జుట్టు రాలుట సత్యము. దానిని నివారించు ప్రయత్నము చేయకపోయినచో అటులనే రాలుచుండును.

అట్టి ఆపదల నుపేక్షింపకుడు. ఇప్పుడే కేశవర్ధినితో మీ తలవెండ్రుకలను రక్షించుకొనుడు. జాడ్యము మీ కురులను ఎంత చిన్నవిగా చేసినను కేశవర్ధిని మీ కేశములను సమముగాను సమృద్ధిగాను చేయును.

# కేశవర్ధిని

యిప్పుడెందు కుపయోగించకూడదు!

కేశవర్ధిని అ. 14, కేశవర్ధిని షాంపూ అ. 14.

ప్యాకింగ్, పోస్టేజి అధికము.

వర్తకు లందరివద్దను దొరకును లేక

సౌత్ ఇండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, :: కోయంబత్తూరు.